క్లుప్తంగా

సచివాలయ భవనం పరిశీలన



సచివాలయాన్ని పరిశీలిస్తున్న డీఆర్పీ నాయుడు తదితరులు

మెళియాపుట్టి: మండలంలోని పట్టుపురం సచివాలయ భవనాన్ని డీఆర్పీ కె.ఎల్.నాయుడు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారదర్శకతతో ప్రజలకు అవగాహన కల్పించేందుకే సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సౌలభ్యం దృష్ట్యా సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చిందన్నారు. ప్రజల అవసరాలు తీర్చడానికి ప్రభుత్వం వెచ్చించిన నిధులతో నిర్మాణం చేపట్టిన భవనాల నాణ్యతను పరిశీలిస్తున్నామని తెలిపారు. లోటుపాట్లు ఉంటే జిల్లాస్థాయి అధికారులు దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు. ఆయనతో పాటు ఇంజినీరింగ్ అసిస్టెంట్ యుగంధర్, ఎఫ్ఏ భాస్కరరావు తదితరులు ఉన్నారు.

'రైతులతో మమేకమవ్వాలి'



మాట్లాడుతున్న ఎంపీపీ గోపి

జలుమూరు: వ్యవసాయ అధికారులు, సిబ్బంది రైతులతో మమేకమవ్వాలని ఎంపీపీ వాన గోపి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది ఆయా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో పొలాలకు వెళ్లి కాలానుగుణంగా వేసే పంటలు, ప్రత్యామ్నాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశానికి హాజరవ్వని అంధవరం, అక్కురాడ వీఏఏలకు నోటీసులు ఇవ్వాలని ఏవో కె.సురేష్ కుమార్‌కు ఆదేశించారు. సమావేశంలో ఏడీ రవీంద్రభారతి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బుక్కా లక్ష్మణరావు, పాలక మండలి సభ్యుడు బగ్గు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలలు పరిశుభ్రంగా ఉండాలి



క్లీనింగ్ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంఈవోలు

నరసన్నపేట: విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా పాఠశాలల్లో గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలని ఎంఈవోలు యు.శాంతారావు, దాలినాయుడులు స్పష్టం చేశారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, వాష్‌రూమ్‌ల పరిశుభ్రతకు అవసరమైన మూడు రకాల లిక్విడ్స్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో విద్యార్థులకు అనారోగ్యం కలగకుండా సంవత్సరానికి రెండుసార్లు క్లీనింగ్‌కు వీలుగా మెటీరియల్ అందిస్తోందన్నారు. హెచ్‌ఎంలు బాధ్యతగా వినియోగించాలని సూచించారు.

ఉచితంగా మందులు పంపిణీ



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: ప్రజారోగ్యం దృష్ట్యా గ్రామాల్లోని ప్రజలకు బీపీ, షుగర్, జ్వరానికి సంబంధించిన మందులు పంపిణీ చేస్తున్నామని పట్టుపురం ఎంఎల్‌హెచ్‌పీ సీహెచ్ రోజా అన్నారు. మండలంలోని పట్టుపురం గ్రామంలో ప్రజలకు వైద్య పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. గత రెండు రోజులుగా ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుంటున్నామని, ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతున్నట్లయితే ఆరోగ్య కేంద్రానికి తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభించాలి

మెళియాపుట్టి: గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలని ఏపీవో రవి అన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో శుక్రవారం సమీక్షించారు. భూగర్భ జలాలను ఒడిసి పట్టడానికి ఉపాధి హామీ పథకం ద్వారా రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ అనే ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. మండలంలో 7 ఇంకుడు గుంతల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని, వర్షపు నీరు ఎక్కువగా ప్రవహించే ఏటవాలు ప్రదేశాల్లో వీటిని నిర్మిస్తామని తెలియజేశారు. ఆయనతో పాటు ఈసీ ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఒక మాయల మరాఠీ



లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న కృష్ణదాస్ తదితరులు

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- నూతన పింఛన్లు పంపిణీ

పోలాకి: చంద్రబాబు ఒక మాయల మరాఠీ అని, ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేయడంలో ఆయన దిట్ట అని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కొత్త పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ఇచ్చిన దాదాపు 98 శాతం హామీలను అమలు చేశామని తెలియజేశారు. నాడు దివంగత సీఎం వైఎస్సార్, నేడు ప్రస్తుత సీఎం జగన్ హయాంలో రాజకీయాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ప్రజల కోసం నిత్యం పరితపించే నాయకులు ఎల్లప్పుడూ ప్రజల గుండెల్లో ఉంటారని తెలియజేశారు. జగన్ తాను వద్దనుకునేంత వరకు సీఎంగా కొనసాగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు, రాష్ట్ర నృత్య అకాడమీ డైరెక్టర్ లండ యర్రయ్య, ఎంపీడీవో ఉషశ్రీ, మండల పార్టీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డోల ఉదయభాస్కర్, సర్పంచ్ మజ్జి రమణమ్మ, నాయకులు బెండి శ్రీనివాసరావు, రెంటికోట త్రినాథరావు, కె.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

లొద్దలపేట గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం

- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



లొద్దలపేట గ్రామానికి ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు

ఆమదాలవలస రూరల్: మండలంలోని బెలమాం గ్రామ పంచాయతీ పరిధి లొద్దలపేట గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని గత బుధవారం నుంచి అందుబాటులోకి తీసుకురావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లొద్దలపేట గ్రామంలో గత సోమవారం స్పీకర్ తమ్మినేని సీతారాం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులంతా కలిసి గ్రామానికి ఆర్టీసీ బస్సు సేవలను ఏర్పాటు చేయాలని కోరడంతో స్పందించిన స్పీకర్ వెంటనే ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. ప్రయాణికులు, విద్యార్థులకు ఉపయోకరంగా ఉండే ఆర్టీసీ బస్సును లొద్దలపేట గ్రామానికి ఏర్పాటు చేయాలని సూచించడంతో, స్పందించిన ఆర్టీసీ అధికారులు తక్షణమే ఆర్టీసీ బస్సును అందుబాటులోకి తీసుకువచ్చారు. శ్రీకాకుళం నుంచి పొందూరు మండలం తాడివలస గ్రామానికి నిత్యం వెళ్లే ఆర్టీసీ బస్సును లొద్దలపేట గ్రామం వరకు పొడిగించడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సు కోసం గ్రామం నుంచి కిలోమీటరు దూరం నడిచి ప్రయాణాలు సాగించేవాళ్లమని, ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయడంతో ఈ కష్టాలు తప్పినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామానికి ఉన్న ప్రధాన సమస్య పరిష్కారం జరిగిందన్నారు.

ప్రతిపక్షాలవి కుమ్మక్కు రాజకీయాలు

- చంద్రబాబుకు నోటీసులపై స్పందించకపోవడం దుర్మార్గం
- చింతాడ రవికుమార్



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఆదాయపు పన్ను శాఖ ఇచ్చిన నోటీసులపై ప్రతిపక్షాలు నోరు మెదపకపోవడం వాళ్ల దుర్మార్గపు కుట్రకు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. స్థానిక జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు రూ.118 కోట్ల అవినీతిపై నోటీసులు ఇస్తే దానిపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ కానీ, రాష్ట్ర బీజేపీ అధినేత్రి దగ్గుబాటి పురందేశ్వరి కానీ, కమ్యూనిస్టులు కానీ స్పందించకపోవడం వాళ్ళ కుమ్మక్కు రాజకీయాలను తెలియజేస్తోందన్నారు. ఇటీవల ప్రతిరోజూ జాతీయ మీడియాలో వైరల్ అవుతున్న చంద్రబాబు వ్యవహారం, ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఈటీవీ, టీవీ-5లో ఒక్కసారి కూడా ప్రస్తావించకపోవడంపై చంద్రబాబు మీడియా మేనేజ్‌మెంట్‌ను అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. రాజధాని పేరుతో చంద్రబాబు లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. ప్రజలు వాస్తవాలు అర్థం చేసుకొని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గడె సూరపునాయుడు, గురుగుబెల్లి జగన్నాథం, కెప్టెన్ రామారావు, అన్నెపు కృష్ణ, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

చారిటబుల్ ట్రస్టుతో విస్తృతంగా సేవలు

- స్పీకర్ తమ్మినేని సీతారాం



ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు అందజేస్తున్న దృశ్యం

పొందూరు: తమ్మినేని శ్రీరామ్మూర్తి ఇందుమతి చారిటబుల్ ట్రస్టు ద్వారా విద్యా, వైద్య తదితర రంగాల్లో విస్తృతంగా సేవలు అందిస్తున్నామని స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. ట్రస్టు ద్వారా మండలంలోని పొందూరు సీహెచ్‌సీకి రెండు, కింతలి పీహెచ్‌సీకి ఒకటి, తాడివలస పీహెచ్‌సీకి ఒక ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను పొందూరు సీహెచ్‌సీ వద్ద శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎవరికి ఎటువంటి ఆపద వచ్చినా, ప్రకృతి విపత్తులు సంభవించినా ట్రస్టు ద్వారా ఆదుకుంటున్నామని తెలియజేశారు. సేవకు మించిన ఆనందం మరొకటి లేదని పేర్కొన్నారు. ట్రస్టు చైర్మన్ తమ్మినేని వాణీ మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజల బాధలు స్వయంగా చూశామని, అందుకే ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను అందజేస్తున్నామని వెల్లడించారు. త్వరలో ఐసీయూ బెడ్స్ అందించనున్నట్లు పేర్కొన్నారు. త్వరలో మండలానికి మూడు రోజుల పాటు కేన్సర్ నివారణ క్యాంప్‌ను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఎడిషనల్ డీఎంహెచ్‌వో అనూరాధ మాట్లాడుతూ రిమ్స్‌లో ఉత్తమ వైద్య సేవలందుతున్నాయని తెలియజేశారు. సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్ ఉచితంగా అందుతున్నాయని, అవసరమైన వారికి బ్లడ్ సప్లయ్ చేస్తున్నామని పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, పార్టీ కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, పొందూరు పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, వైస్ ఎంపీపీ వండాన వెంకట్రావు, వండాన సూర పునాయుడు, కిల్లాన సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



పాతపట్నం: తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న ఎంపీపీ సావిత్రమ్మ



సారవకోట: అవగాహన కల్పిస్తున్న సుజాత

పాతపట్నం: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని, ఆరు నెలల వరకు పిల్లలకు తల్లిపాలు పట్టాలని ఎంపీపీ దొర సావిత్రమ్మ సూచించారు. మండలంలోని లాబర గ్రామంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పోషకాహార మాసోత్సవంలో పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పౌష్టికాహార కిట్లను అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న విలువైన ఆహార పదార్థాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి ఫుడ్ తెచ్చుకోవడానికి పడుతున్న ఇబ్బందులను గుర్తించి, ప్రభుత్వం టేక్ హోం కిట్లను అందిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో సీడీపీవో విమలారాణి తదితరులు పాల్గొన్నారు.

సారవకోట: గర్భిణులు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవాలని బుడితి సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ డి.సుజాత సూచించారు. మండలంలోని చీడిపూడి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం మాసోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు ఎక్కువగా ఐరన్ సంబంధిత ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. అనంతరం పౌష్టికాహార పదార్థాల ప్రదర్శనను చేపట్టారు. ఆమెతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు నిక్కు కృష్ణారావు, పాఠశాల హెచ్ఎం పాటోజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై శ్రద్ధ కనబర్చాలి

బూర్జ: మొక్కల పెంపకంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ కనబర్చాలని పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. మండలంలోని ఏటీసీపేటలో హార్టికల్చర్ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కలను శుక్రవారం పరిశీలించారు. సంబంధిత రైతుతో మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో భాగంగా మొక్కల పెంపకానికి నెలకు రూ.600 అందుతున్నాయో లేదో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత సైతం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ పి.రాధ, ఏపీవో వి.రాజ్‌కుమార్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి



రైతులతో మాట్లాడుతున్న ఏవో సునీత

నరసన్నపేట: వాతావరణంలో మార్పులతో వరిపైర్లకు తెగుళ్లు ఆశించే ప్రమాదముందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి కె.సునీత సూచించారు. మండలంలోని చిక్కాలవలసలో వైఎస్సార్ పొలంబడి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను పొలాల వద్దకు తీసుకెళ్లి యాజమాన్య పద్ధతులు వివరించారు. రోజు విడిచి రోజు పొలాలను పరిశీలిస్తుండాలని సూచించారు. పైర్లలో తేడాలు కనిపిస్తే వెంటనే సంబంధిత వీఏఏల వద్దకు వెళ్లి సూచనలు పొందాలన్నారు. విచ్చలవిడిగా క్రిమి సంహారక మందులు వాడవద్దని కోరారు. ప్రతి ఒక్కరూ ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి అని పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న వెలుగు అసోసియేషన్ సిబ్బంది

పాతపట్నం: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యదాయకమైన పంటలు పండుతాయని పలువురు కొత్తూరు వెలుగు అసోసియేషన్ సిబ్బంది అన్నారు. మండలంలోని రేంగూడ గ్రామంలో రైతులకు పలు నూతన పద్ధతులపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వరిపొలంలో రాగిలైన్ పద్ధతి ద్వారా విత్తన శుద్ధి చేయడాన్ని వివరించారు. ఈ ప్రక్రియ ద్వారా శుద్ధి చేసిన నారును నాటితే అధిక దిగుబడులు సాధించే అవకాశాలు ఉన్నాయన్నారు. అంతేకాకుండా పెట్టుబడి తగ్గించడానికి బంతి మొక్కల పెంపకం, పక్షి స్థావరాల ఏర్పాటు, లైన్ షోయింగ్ విధానం అవలంబించాలన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ నాగరాజు, నాగేశ్వరరావు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలపై ఫిర్యాదు

పాతపట్నం: రాష్ట్ర గిరిజన మంత్రి పీడిక రాజన్నదొరపై తప్పుడు ఆరోపణలు చేసినందుకు టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్‌పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గురాడి అప్పన్న కోరారు. ఈ మేరకు పాతపట్నం ఎస్ఐ మహ్మద్ యాసిన్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆయనతో పాటు ఎంపీపీ దొర సావిత్రమ్మ, కోదూరు సర్పంచ్ మోహన్ తదితరులు ఉన్నారు.

తక్షణ సాయం అందజేత

సరుబుజ్జిలి: మండలంలోని సింధువాడ గ్రామానికి చెందిన దువ్వారపు నీలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను మండల పరిషత్ ఉపాధ్యక్షుడు జీవీ శివానందమూర్తి చేతులమీదుగా శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ సౌజన్య, గ్రామ వలంటీర్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

'ఇంటి నంబర్ ఉండేలా చర్యలు తీసుకోవాలి'

కొత్తూరు: ప్రతీ ఓటరుకు ఇంటి నంబర్ ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని బీఎల్వోలకు తహసీల్దార్ చక్రవర్తి స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ నేతలు, బీఎల్వోలతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. జీరో ఇంటి నంబర్‌తో ఓటు ఉండకూడదన్నారు. ఓటు నమోదుకు అర్హత ఉన్నవారి నుంచి దరఖాస్తులు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో సూపర్‌వైజర్‌లు, పలు పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

'మైనార్టీల మద్దతు వైఎస్సార్‌సీపీకే'



ధర్మాన కృష్ణదాస్‌ను సత్కరిస్తున్న అన్వేష్

పోలాకి: రాష్ట్రంలో అన్ని మైనార్టీల మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉంటుందని జిల్లా వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు పి.అన్వేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో వివరించాలని కృష్ణదాస్ సూచించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- పీఎల్‌దేవిపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం

బూర్జ: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో పీఎల్‌దేవిపేట పంచాయతీలోని పీఎల్‌దేవిపేట, నరేంద్రపురం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు సక్రమంగా పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. స్థానికుల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనునిత్యం ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, ఎంపీడీవో ఎం.రవీంద్రబాబు, తహసీల్దార్ ఎస్.రమణారావు, వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తి నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకట్రావు, మండల కన్వీనర్ల కో-ఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, నాయకులు బొడ్డేపల్లి నాగరాజు, మామిడి శ్రీనివాసరావు, తొత్తడి సురేష్, గేదెల వెంకటరమణ, మజ్జి రాము, లావేటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పును కప్పిపుచ్చుకునేందుకు చంద్రబాబు యత్నం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో ప్రజలు రెచ్చకొట్టి తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. పాతపట్నం క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. అమరావతి ఇళ్లు, కార్యాలయాల నిర్మాణం పేరుతో రూ.118 కోట్లు స్వాహా చేసిన చంద్రబాబు బండారం, ఐటీ నోటీసులతో బయటపడడంతో రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు చూస్తున్నారన్నారు. ఐటీ నోటీసులకు సమాధానం చెప్పకుండా కోర్టుల్లో స్టేలు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని దుమ్మెత్తిపోశారు. చంద్రబాబు రూ.118 కోట్లు తినేస్తే ప్రజలు రక్షణ వలయంగా నిలవాలని పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు.

చంద్రబాబు రూ.కోట్ల స్కాంలు చేస్తే ప్రజలు అండగా నిలవాలా అని ప్రశ్నించారు. మామను వెన్నుపోటు పొడిచిన వ్యక్తికి ప్రజలను మోసం చేయడం పెద్ద విషయం కాదని ఎద్దేవా చేశారు. జిల్లా ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, మాజీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వీరంతా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ కొండాల అర్జునుడు, మంచు చంద్రయ్య, సారిపల్లి ప్రసాద్, ఏవీ సురేష్, తూలుగు ప్రవీణ్, జైమునిరావు తదితరులు పాల్గొన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కరజాడ వాసి



అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

మెళియాపుట్టి: మండలంలోని కరజాడ గ్రామానికి చెందిన నెమలిపురి సత్యనారాయణకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటుదక్కింది. ఇతను విశాఖపట్నంలోని నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఇతను భారతదేశమే కాకుండా ప్రపంచ దేశాల సాహిత్యంపై అధ్యయనం చేశారు. భారత దేశ విశ్వవిద్యాలయాల్లో ప్రిజన్ లిటరేచర్‌ను పరిచయం చేయాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ ఉప ప్రధానమంత్రి ఎల్‌కే అద్వానీలను విజ్ఞాపించారు. ఇది ప్రత్యేకమైన బాధ్యతగా గుర్తించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కల్పించినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. మండలానికి చెందిన వ్యక్తి కావడంతో పలువురు విద్యావేత్తలు, ప్రముఖులు, ప్రజలు ఆయనకు అభినందనలు తెలిపారు.